

# ప్రస్థానం

వాడ్రేవు పతంజలి

### తొలి మజిలీ

రాయుణ్ణి ఎవరూ గుర్తుపట్ట లేకపోయారు.

రాయుడు పంట్లాం తొడిగాడు గళ్ళ బుష్ షర్టు వేసుకొన్నాడు క్రాపింగు ముఖంమీదికి పడేట్లా ఒత్తి దువ్వుకొన్నాడు. కళ్ళకి తగిలించుకొన్న మబ్బుజోడు దాదాపుగా అతని నుదుటిరంగులో కలిసిపోయింది.

ఏ పట్నవాసపు దొరబాబో వచ్చాడనుకొన్నారు. అమ్మవారి గుడి అరుగుమీద చుట్ట కాల్చుకొంటూ, మోకాళ్ళమీద చేతులూని ఉబుసుపోక కబుర్లు చెప్పుకొనే వెంకటేశం వాళ్ళ దగ్గరకంటూ వచ్చి పలకరించినప్పుడు గాని ఆ వచ్చింది రాయుడని ఎవరికీ తెలిసిందే కాదు. అందరూ రాయుడు కేసి ఆశ్చర్యంగా చూశారు. కళ్ళింత చేసుకొని కనుబొమ లెగరవేశారు.

కాని కూర్చున్నవారంతా అప్రయత్నంగా స్థానభంగిమలు మార్చారు. చుట్టలు పారేసి, అరుగు చివరికి జరిగారు కొందరు.

చేతిలోవున్న పెట్టె గుడి అరుగుమీద ఉంచాడు రాయుడు. కాలరు క్రిందనుంచి రంగు రుమాలు తీసి నుదురు తుడుచుకున్నాడు. మిసమిసలాడిపోయే పంట్లాం జేబులోనించి సిగరెట్టు పెట్టె తీసి, ఒకటి ముట్టించాడు. నిర్లక్ష్యంగా పొగ వదిలాడు.

వెంకటేశం ఓ సారి తన మాసిన బనీను, బొంతకుట్లున్న పంచి చూసుకొన్నాడు తన చుట్ట కేసి చూసుకొన్నాడు. మొరాయించిన కాడను కసిగా దులిపాడు.

రాయుడు కేసి కళ్ళు ఇంత జేసుకొని చూస్తున్నారందరూ.

"రారా, కూచో!" అన్నాడు వెంకటేశం, తన సరసన జాగా చూపిస్తో, చేత్తో దుమ్ము ఊదుస్తో.

'నువ్వెళ్ళి మూడేళ్లుగా వొచ్చిందేరా?'

ఓ చేయి పంట్లాం జేబులో వుంది. మిల్లు గొట్టంలా పొగలు వదులుతూ సిగరెట్టు కాలుస్తున్నాడు రాయుడు. ముఖంమీదికి వడ్డ వెంట్రుకలు వెనక్కి తోస్తున్నాడు. మళ్ళీ ఒక్కొక్కటొక్కటిగా విరిచి ముఖం మీద పడేలా చేస్తున్నాడు. వుండి వుండి రుమాలుతో ముఖాన్ని రాచి రాచి తుడుచుకొంటున్నాడు.

గుడి అరుగుమీద కూర్చొన్నవాళ్లూ, దారినపోతో రాయుణ్ణి చూసి గుర్తుపట్టి ఆగినవాళ్లూ గుచ్చిగుచ్చి అడుగుతున్నారు

"పట్టంలో ఏం జేస్తన్నవ్...?"

"కూలే మాత్రం గిడదేటి...?"

"ఏ పట్టవాసపు పిల్లనేనా కట్టేసుగున్నవేటి...?"

రాయుడు చిరునవ్వు నవ్వుతున్నాడు, నిర్లక్ష్యంగా. తన ఎర్రబూటు మీది దుమ్ముని రుమాలుతో దులుపుతున్నాడు.

పట్టవాసంవాళ్ళే నయం, అదే లోకం వాగరు, అనుకొన్నాడు వెంకటేశం.

ఆ సాయంకాలం-

పట్టంనుంచి రాయుడు తిరిగొచ్చాడని రంగమ్మతో చెప్పాడు వెంకటేశం.

"నాకు తెల్సులే. కోడిని కోస్తున్నానని చెప్పింది అత్త."

చాలా ఉత్సాహంగా చెప్పింది రంగమ్మ తనకి తెలీకండానే వెంకటేశం కనుబొమ లెగిరాయి.

రాత్రి వెంకటేశానికి నిద్రపట్టలేదు. తన చాపచుట్టూ చుట్టబూడిద పరుచుకొని వుంది. అతని ఆలోచన పూర్తిగా రాయుడు చెప్పిన మాటలమీదనే వుంది.

చుట్టవాసన వెగటనిపించింది. లేచి ఇవతలికొచ్చాడు. అదే ఆలోచన. ఓ సారి "అవును" అనుకొంటాడు. మరుక్షణంలో "కూడదు" అనుకొంటాడు. ఎంత ఆలోచించినా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నాడు వెంకటేశం.

స్కూలు ఎగేసి, నిన్న మొన్నటిదాకా గొడ్లకాడ తిరిగాడు రాయుడు. కామందులు పెడితే తిన్నాడు, పెట్టనినాడు పస్తున్నాడు రాయుడు. గొడ్లనికడిగి, గడ్డేసి, నీళ్ళు మోసేవాడు రాయుడు. పంచెపాతకి గతిలేకుండా గడిపాడు రాయుడు.

ఇవాళ ఎలా వున్నాడూ రాయుడు!

తనకి బాగా గుర్తుంది ఏదో ఖర్చు కోసం బాబు ఇచ్చిన నాలుగయిదు రూపాయలూ తీసుకొని మరిపత్తాలేకుండా పోయాడు. వాడి బతుక్కి అవే నాలుగయిదు వందల్లా కనబడి వుంటయి. ఎక్కడున్నాడో, అసలు ఉన్నాడో, ఊడాడో ఎవరికీ తెలీలేదు. బాబు చచ్చిపోయినట్టు వాడికి తెలియజేయనుగూడా అవకాశం లేకపోయింది.

ఆ డబ్బుతో పట్టం పారిపోయాడట. చేతిలో వున్నది కాస్తా రెండు రోజుల్లో కరిగిపోయింది. కూలికోసం తిరిగి తిరిగి, చివరికి ఎవరినో కడుపూ కాళ్ళూ పట్టుకొని ఒకరింట్లో చాకిరీకి కుదిరాడట.

మంచిగా మసులుకొన్నాడట.

ఇంటి అయ్యగారు మెచ్చుకొని వారి మిల్లులో పని ఇప్పించారట.

రాయుడు దశ తిరిగింది.

ఇప్పుడు రాయుడికి ఎటు తిరిగీ, నెలకి నూరు రూపాయి లొస్తాయట!

నూరు రూపాయలు!!

నూరు రూపాయలు!!

ఆ ఆలోచన వెంకటేశం ముఖాన ఫెళ్ళున కొట్టింది.

చుక్కతోబాటు లేచి, చీకటి పడేవరకూ రోజల్లా, అన్ని రోజులూ, గొడ్డు చాకిరీ చేస్తాడు. వారం సంతకి అయిదు రూపాయలు దొరకటం అంటే కొండమీది చంద్రుడు దక్కినట్టే. రంగమ్మ తెలివిగా చేసుకురాబట్టిగాని ఎన్నిపూటలు పస్తుండాల్సి వచ్చేదో?

రంగమ్మకి ఆ మధ్య రోగం వొచ్చి, అది గిలగిల్లాడతావుంటే కాసు విదిపిన నాయన లేడు. కాని దంతావేసుకు కులుకుతూవున్న చిన్నాయనకూడా కసిరి కొట్టాడు

ఇక్కడ తనకి ఎవరున్నారు కనక? కష్టంలో తన్ని ఎవరు ఆదుకోగలిగేరు కనక? ఇంత వూరూ తనకి కాడితో సమానమేగాని ఎవ రున్నారని? ఏం వుందని?

తను ముత్తాతలు, తాత తండ్రులు ఇక్కడ పుట్టారు. ఈ మట్టిలో పెరిగారు

వాళ్ళూ కలిగినవాళ్లు కారు. అలాగని నాలుగువేళ్ళూ నోట్లోకి పోగలిగేవా అంటే అదీ లేదు. ఇతర అలవాట్లలాగా, పస్తులుకూడా అలవాటే అయ్యాయి వారికి. విశేషమేమీలేదు దీనిలో. అయినా ఊరువిడిచి, ఏ పట్టణమో వెళ్ళిపోవాలనే ఆలోచన వారికి ఎన్నడూ కలగలేదు.

వాళ్ళని ఏ ఆశ ఆపిందో మరి? అలాటి ఆశ తన కేమీ మిగలలేదేం?

పట్నం పోయి తనుకూడా ఏ మిల్లు లోనో నౌకిరీ సంపాదించుకొంటే...?

రాయుడు సాయం చేస్తానన్నాడుగా!

నౌకిరీ దొరక్కపోతే, లాక్కు బతికేందుకు రిక్షా లుంటవిగా!

చరచరా లోపలికొచ్చాడు వేంకటేశం.

## రెండో మజిలీ

"ఎవరూ చూడలేదుకద!"

"అమ్మో. చూస్తే ఇంకేవన్నా వుందా?"

రాములికి ఎందుకో అనుమానం కలిగింది. చూసీ చూడనట్టు బండి లోపలికి చూశాడు. ఒకరిజోలి మనకెందుకులే అనే వాడే అయినా ఉండబట్టలేకపోయాడు రాములు.

"పెట్టిలో ఏమేం తెచ్చావ్?"

"అన్నీ తెచ్చా..."

"అన్నీ అంటే?"


చలికాలం కాకపోయినా ముఖం బాగా కప్పుకొని కూర్చొంది ఆవిడ. ఆయన తలమీదనించీ కండువా చుట్టుకొన్నాడు. వాళ్లు ఎవరయిందో రాములు గ్రహించలేకపోయాడు.

"చంద్రహారాలు, కట్లకాసుల పేరు, శంఖాల తావళం, వడ్డాణం, గాజులు."

చీకట్లో అయన ఆవిడను మరీదగ్గరగా తీసుకొన్నట్టు చప్పుడయింది.

"ముత్యాల దుద్దులూ, పాపటబిళ్ళ ఉన్నాయని చెప్పావుగా?"

"అవును" ఆవిడ తేలికగా శ్వాస




తీసుకొంటూ అంది. "అవి మా అమ్మవి. అయినా తెచ్చేశాను."

ఆయనా, ఆవిడా ఎంత మెల్లిగా మాట్లాడుకుంటోన్నా. చుక్క పొడుపు కూడా వినిపించేటంత నిశబ్దంగా ఉన్న వేకువ సమయంలో రాములు వారి సంభాషణ పూర్తిగా వినగలిగాడు.

"ఇంతకీ ఇప్పుడు..."

ఇంకా మెల్లిగా మాట్లాడమని ఆయన ఆవిడ నోరు నొక్కడానికి ప్రయత్నించినట్టుంది. నూతిలో గొంతులా వినబడిందా మాట. ఆ వెంటనే మరో విచిత్రమైన శబ్దం.

"...తిన్నగా మద్రాసేనా?"

వెలుగొచ్చే ముందు చిక్కని తెర గుడ్డలా, నల్లని సముద్రంలా పరుచుకొని గాఢంగా అలుముకున్న ఆ అంధకారంలో ఆయన వేళ్ళు ఆవిడ శరీరంకోసం వెతుకుతున్నయి. బనీనుగుడ్డకూడా లేని రాములి వొంటికి తగిలాయి. వాత పెట్టినంత చురుక్కుమనిపించింది రాములికి.

ఆయన మాత్రం గమనించినట్టులేదు.

"ఈ వేళకి పట్నం వెళ్లే బళ్ళుండవు. ముందు ఈ వూరు శని విరగడయితే...!"

ఆయన తన పొడుగాటి చేతులు చాచి, ఆవిడ మెడచుట్టూ వేసి ముఖాన్ని తన వైపుకు లాక్కున్నాడు. ఏవో అస్పష్టమైన శబ్దాలు. అంతకన్నా కొంచెం స్పష్టంగా మాటలు..

"సరాసరి బెజవాడ వెళదాం. నా చిన్ననాటి స్నేహితుడొక డున్నాడక్కడ. మణిమూల బంధువు. వాడి దగ్గర్నుంచి ఓ ఉత్తరం తీసుకొని పట్నం వెళ్ళటం బాగుంటుందని ఆలోచించాను."

ఆయన మాటల్ని అతి శ్రద్ధగా ఆవిడ వింటోందని రాములు గ్రహించాడు. ఒకొక్క అక్షరాన్నీ జీర్ణించుకొని అభిప్రాయం చెబుతూన్నట్టుగా "అదే మంచిదేమో!" అంది.

"లేకపోతే ఇబ్బంది పడొచ్చు" అని వివరించింది.

'నీ వయసు, నీ సొగసు, నీ వొంపులు చూసి నిగ్రహించుకోగలగడం ఎవరికి సాధ్యంలే' అని చెప్పదలిచికాబోలు ఆయన ఆవిడవైపుకి జరిగినట్టుంది.

బండి కొద్దిగా తేలిపోయింది.

కథలో లోతు రాములికి కొద్దిగా బోధపడసాగింది.

అమానుషమైన మనుషులు, అసహ్యకరమైన ఇల్లు ఆవిడకి ప్రాణాంతకమయాయి. భయంకరమైన అంధకారంలో నికృష్టమైన జీవితం గడిపిం దావిడ. ఆశలుడిగి, జీవితంమీదనే ఆశ సన్నగిలింది. తన్ని ఆశించేవారూ లేరు. ఎప్పుడో, ఎవరో

ఆవిడ అందమైన కళ్ళని చూసీ, ఒంపులు తిరిగిన ఒళ్ళు చూసీ, మెడ నిక్కించి తిరిగి తిరిగి తిలకిస్తే ఎంతో సంబరపడిపోయేది. ఉత్సాహంతో ఈలలు వేసేది. జీవితంలో మిగిలిపోయిన కలలూ, అణగిపోయిన ఆశలూ ఒక్కసారి విజృంభించేవి. తన్ను ఎవరేనా కోరుకోవాలనే తాను కోరుకొనేది. మరి. ఆ తిరిగి తిరిగి తిలకించిన ఎవరో నిర్లక్ష్యంగా వెళ్ళిపోతే కుమిలిపోయేది.

"ఆఁ! మనం వెడుతూన్నట్టు మీ ఆవిడికి తెల్సా?"

పరాచకం ఆడుతున్నట్టు కాబోలు ఆవిడ ఆయన మీదికి వొరిగింది. రాములికి వూతం సరిపోయింది.

"ఛ! ఛ!! ఎందుకు తెలీనిస్తాను? తెలిసినా, నన్ను గురించి నాకు ఏ చింతా లేదు గాని, మసి బూసి మారేడుకాయ చేసి, ఆ మార్కండేయులు సుబ్బలక్ష్మిని లేవదీసుకు పోయాట్ట అని ఊళ్ళో నీ పేరు రచ్చకి రావటం నా కిష్టంలేదు."

ఆయన మాటల్లో ఆవిడకి పూర్తి విశ్వాసం వుంది కాబోలు. కొద్దిసేపటి వరకూ ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

రాములు గుర్రాన్ని అదలించడం లేదు. చుట్ట కాల్చుకొనే మిషమీద ముఖం లోపలికి పెట్టి, అగ్గిపుల్ల గీశాడు.

అగ్గిపుల్ల వెలుగుకి జడుసుకున్నట్టుగా దూరంగా జరగడానికి ప్రయత్నించారు. ఒక్కసారి బండి వూగిపోయింది.

ఇక తనకి కూడా వినిపించనంతగా గుసగుసలు. అణచుకోలేని ఉద్వేగంతో ఆయన బుసలు కొడుతూన్నట్టుగా కీచురాళ్ళ రొద రొద.

ఆయనా, ఆవిడా ఎలా ఉంటారో రాములు ఊహించుకోసాగాడు. బక్కపలాచగా, చప్పిడి బుగ్గలతో, బాలరాజు లాటి కత్తిమీసంతో, నిర్లిప్తత కనబడే కళ్ళతో, గ్లాస్గోలాల్చీతో ఆయన. ఆయన మల్లుపంచె కొంగుని ఆవిడ తన చేతికి చుట్టుకొని ఉంటుందని అనిపించింది రాములికి ఎందుకో.

ఇహ ఆవిడ—

మూసుకుపోతూన్న నుదురు, చక్రాల్లా తిరిగిపోయే నల్లని కళ్ళు. మొనదేరిన ముక్కు, చిక్కని పెదాలు. గడ్డంకింద ఆవిడ ఆకారం ఎలావుంటుందో రాములు ఊహించుకోలేక పోయాడు. అయినా పొంగిన వక్షాలు, వొంపులు తిరిగిన వొళ్ళు వుండే వుంటాయనుకున్నాడు.

మళ్ళీ గుసగుసలు. చెవులు విప్పుకు విన్నాడు రాములు.

"నీతో చెప్పనేలేదు, చూశావా... మొన్న రాత్రి నువ్వు నా జడలో మల్లెదండ తురిమిన సంగతి పూర్తిగా మరచిపోయి ఇంట్లోకి వెళ్ళిపోయాక ఎంత రాద్ధాంతం జరిగిందనుకున్నావ్?"

"ఏం జరిగిందేమిటి?" అని ఆత్రంగా తెలుసుకోడానికి ఆయన ఆవిడ ముఖం మీద ముఖం పెట్టి వింటూనే ఉన్నాడనిపించింది రాములికి.

"నాన్న మండిపడ్డాడు. నన్ను నానా తిట్లూ తిట్టాడు. చెడబుట్టా నన్నాడు. చచ్చినా సంతోషిద్దునన్నాడు."

ఆవిడ ఉక్రోషంతో చెప్పుకుపోతోంది.

"అమ్మ నెత్తీనోరూ మొత్తుకుంది. నాకీ జన్మకి పువ్వులు ముడుచుకొనే రాత లేకపోయిందే అని భోరున ఏడ్చింది. ఏడాది తిరక్కుండానే నా జీవితం తెల్లారిపోయిందే అని తెల్లవార్లూ ఒకేధోరణి!"

మంచి చీరెలు కట్టరాదట. నగలుగాని పువ్వులుగాని పెట్టుకోకూడదట. ఆవిడకి అవి మాత్రమే ఎంతో యిష్టమట. సానుభూతి చూపుతూన్నట్టు ఆయన ఒక్కసారి మూలిగాడు.

మూలిగి, "ఉబ్బసం వెధవని కట్టబెట్టారు. ... చచ్చాడో, నిన్ను సుఖపెట్టాడో!" ఎంతో అలవాటుగా అంటున్నట్టు అన్నాడాయన ఈమాట.

ఆవిడ మనసు ఇంకా తేలిక పడినట్టు లేదు.

"నాన్న అరుపులూ, అమ్మ ఏడుపులూ అలావుండగా, నంగనాచిలా అక్క నా దగ్గరికి చేరి నీ మీద ఎన్ని చెప్పిందనుకున్నావ్?"

ఆవిడ అక్కగారు చెప్పిందేవిటో తెలుసుకోడానికి ఆయన అంత ఆసక్తి కనబరచినట్టు లేదు.

"నువు జులాయి వాడివిట ... వట్టి తాగుబోతువిటా..."

"బండి కదతావుటోయ్" అని ఎవరో కళ్ళకి ఎండ తగలకండా చేయి అడ్డు పెట్టుకొంటూ అరిచాడు, రోడ్డు అవతలి వైపునుంచి.

## మూడో మజిలీ

రత్తయ్య పచ్చికమీద వెల్లకిలా పడుకున్నాడు. అక్కడా అక్కడా దూరాన కొండల వెనకనించి సూర్యుడు అడుగులో అడుగు వేసుకొంటూ క్రిందికి దిగుతున్నాడు. నాలుకలు చాచిన చీకటి సత్తువలేని చిరువెలుగుల్ని మింగుతోంది.

రత్తయ్య శూన్యంలోకి చూస్తున్నాడు. అస్పష్టమైన ధ్వనితో నది మెల్లగా ప్రవహిస్తోంది. నీటి మీద గూటికి ఎగిరొచ్చే పిట్టలు కిలకిలమంటున్నయి. నదిప్రవాహంలో మెల్లిగా సాగిపోయే పడవమీది సరంగులు పాట పాడుతున్నారు. తన చుట్టూవున్న జీవితాన్ని రత్తయ్యకు ఎడనెడా గుర్తుకు తెస్తో.

రత్తయ్య ఉత్సాహంగా వున్నాడు. అతని మనసు ఉరకలు వేస్తోంది. గడ్డం కింద చేతులుంచి చుట్టూవున్న ప్రకృతిని పరికిస్తున్నాడు.

అతని మనసులో మెరుపు మెరిసింది. తనకి తెలీకండానే కూనరాగాలు తీస్తున్నాడు.

రత్తయ్యకి కొద్దిదూరంలో విలాసయాత్రకి వచ్చిన విద్యార్థి బృందం కులా



సాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. కాఫీ తాగుతో, సిగరెట్లు గుప్పుతో.

ఆ ప్రశాంత వాతావరణానికి రత్తయ్య ముగ్ధుడయాడు. కూనరాగం సాగుతూనే వుంది. క్రమంగా పదాలు కూర్చుకొంది–పాటగా సాగింది. పూర్తిగా గొంతు విప్పి ఉత్సాహంగా పాడుతున్నాడు రత్తయ్య.

పాట పాడుతో నీటిమీదికి చూస్తున్నాడు. అతని చూపు అవతలిగట్టుకి చేరింది. అందమైన మామిడితోపు పక్కనే ఓ గుడిసె. గుడిసెచుట్టూ ముత్యాలవంటి ముగ్గులు.

చిరిగిన తెరచాపతో సాగిపోయే పడవ అతని దృష్టికి ఒక్క క్షణంపాటు అడ్డు పడింది.

రత్తయ్యపాట విద్యార్థి బృందం చెవులపడింది.

మనసును ఆకట్టుకొనేపాట. అంతటా నిశ్శబ్దం. విద్యార్థులంతా రత్తయ్యవైపే చూస్తున్నారు–విచిత్రంగా, ఆశ్చర్యంగా.

రత్తయ్య దృష్టి అస్పష్టంగా నదికి అవతలిగట్టున తిరుగుతోంది. దూర దూరాలనుంచి వీస్తూ వచ్చేగాలి ఏవో సువాసనల్ని మోసుకొస్తోంది. ఆ చల్లదనం కితకితలు పెడుతోంది.

గుడిసె వెలుపల పనిపాటలు చేసుకొనే ఆడమనిషి. పక్కన గడ్డివాము – ఇద్దరు పిల్లలు వామునెక్కి ఆడుకొంటున్నారు. గెంతుతున్నారు. గడ్డి విసురుకుంటున్నారు. తోసుకుంటున్నారు, పడుతున్నారు, లేస్తున్నారు.

రత్తయ్య మనసు ఆనందంతో నిండిపోతోంది.

రత్తయ్య కాళ్లు పాటకి దరువు వేస్తున్నాయి. పాట కాలం హెచ్చింది. సెలయేటి జాలులా, మగ కోయిలకూతలా సాగిపోతోంది రత్తయ్యపాట. ఏదో తెలీని ఆకర్షణ అతని గొంతులో.

రత్తయ్య పాడుతున్నాడు. విచిత్రంగా ఆశ్చర్యంగా విద్యార్థులు అతనివైపే చూస్తున్నారని రత్తయ్యకి తెలీదు.

రత్తయ్య పాడుతున్నాడు.

పల్లెసీమల విశాలత అతని గొంతులో వుంది. కొండంత గంభీరతా వుంది.

లోయంత గాఢత్వమూ వుంది అతని గొంతులో.

విద్యార్థులు ఆశ్చర్యం పట్టలేక పోయారు. విస్మయపడ్డారు. ఇంత చక్కగా పాడటం ఇతనికి ఎవరు నేర్పారో? మనకి తెలీకండా మన్ని ఏ ఎత్తులకో తీసుకుపోయే శక్తి ఇతనికి ఎవరిచ్చారో? ఎవరో? ఎవరు నేర్పారో?

వేళ్ళసందుల్లో సిగరెట్లు కొడిగడుతున్నయి.

అసంపూర్ణ రేఖాచిత్రాలు నిస్సహాయంగా తేరిచూస్తున్నయి-స్కెచ్ బుక్కుల్లోంచి.

వెంకటేశ్వర్రావు మాత్రం అదోలా చూస్తూ పెదవి గట్టిగా కొరుకుతున్నాడు.

పద్మ అతని ముఖంలోకి చూస్తోంది.

వెంకటేశ్వర్రావు మనసులో నల్లని మబ్బులు ముసురుతున్నయి.

ఈర్ష్య, అసహనం అతని మనసులో గూడు కట్టుకుంటున్నయి.

పద్మకి విస్మయం కలిగింది.

పాట ముగిసింది. కాని వాతావరణంలో అంతటా సంగీతం వినిపిస్తోంది.

వెంకటేశ్వర్రావు నుదుటిమీద ద్వేషం ముడతలు తేరింది.

పద్మకి అర్థం కాలేదు.

వెంకటేశ్వర్రావుకి తప్ప మరొకరికి పాట పాడి 'ఓహో!' అనిపించగల హక్కు లేదూ?

బంట్రోతు పాడిన పాట విని ఆనందించటం సంస్కారం కాదా? ఏమో?

చప్పట్లు విని రత్తయ్య బిడియపడిపోయాడు. మెలికెలు తిరిగాడు. ఫ్లాస్కు, సంచీ భుజానవేసుకొని విద్యార్థిబృందం వెనక అడుగులో అడుగు వేసుకొంటూ నడిచాడు.

## నాలుగో మజిలీ

రాజారావు నడుస్తున్నాడు.

రాజారావుకి ఆ వీధిన వెళ్ళడం కొత్త ఏమీ కాదు. దాదాపు పాతికేళ్ళనుంచి నిత్యం కనీసం రెండుమార్లన్నా ఆ వీధిన వెడతాడు.

రాజారావు నడుస్తున్నాడు, బంతిలా తుళ్ళుతూ.

రాజారావు ఆ వీధిన వెళ్ళటం ఆ వీధి వాళ్ళకి కొత్తకాదు. వీధిలో సగంవరకూ ఆక్రమించుకొన్న అద్దెసైకిళ్ళ ఆసామి రాజారావు వెళ్ళేటప్పుడల్లా ఓ సారి కొట్టోవున్న గడియారం కేసి చూసుకొని సంతృప్తిపడతాడు.

దారినపోతో, ఇళ్ళలోకి, వీధి గదుల్లోకి మెడ నిక్కించి చూడటం కూడా అతని కొత్తకాదు. పెద్దమేడ వీధిగదిలో రెండేళ్ళ కోమారు మారుతూండే స్టూడెంటు కుర్రాళ్ళ వింత వింత ముఖాలూ, గుమ్మంలో మెరిసిపోయే కొత్తసైకిళ్లూ, లోపల ట్రాన్సిస్టరునుంచి 'బంయ్' మని వినబడే సినిమా పాటలూ అతనికి కొత్తకాదు.

ఏమీ కొత్తకాదు.

మేడకి ఎదురుగావున్న పెంకుటింటి వారి పెద్దపిల్ల వోణీ సవిరించుకొంటో, పనిపట్టుగా అరుగుచివరి కొచ్చి, సిమెంటు స్తంభాన్ని పట్టుకొని హేలగా ఊగుతో, అటు చూసి, ఇటు చూసి, ఒక్కచూపు ఎదురు గదివంక చూసి పొడుగాటి జడ విసురుకుంటూ విలాసంగా నిష్క్రమించటం, అదే క్షణాన మేడ గదిలో ఒక్కసారి కల్లోలం రేగడం రాజారావుకి కొత్తకాదు.

బొద్దుగా, పొట్టిగా, ఎండలో మిలమిలా మెరుస్తూ, క్షణ క్షణం కనుబొమ ఎగరేస్తూ, గదాధరుడి మల్లే భుజాన ముసిలి గొడుగు ఊపుతో, కాళ్ళు ఈడ్చుకొంటో...

చిరిగిన చెప్పు మడమలోంచి సూదాటి రాయి గుచ్చుకోగా, వల్లకీ బొంగులా మెలికెలు తిరిగిపోయి, ఒంటికాలిమీద కుంటుకొంటో తను అరుగు చివరను ఆనుకొని శనిదేవత కోరవంటి రాయిని తీసిపారేసి...

అరగంటనుంచి అదేపనిగా దుయ్యబట్టి అలిసిపోయిన ఆఫీసరు ''ఇక వెళ్ళు'' అన్నంత సంబరపడుతో...

దొర్లుకుంటూ పోయే రాజారావు ఆ పిల్లకీ కొత్తకాదు.

దూర్వాసులు వకీలుగారి ఇంటి హాలులో ఆ అందమైన అమ్మాయి రేఖాచిత్రం ఎప్పుడూ చిరునవ్వులు వొలికిస్తోవే వుంటుంది...

రాజారావుకి ఏమీ కొత్తకాదు...

డాబా యింటి హాలులో, వాలు కుర్చీలో కూచొని అరమూతలు పడే కళ్ళతో చుట్టపొగలు వదిలే ఆ నామాల బుగ్గమీసాల తాతగారు ఎప్పుడూ అక్కడే వుంటారు...వారి యింటి గుమ్మాలికి ఎంత అందమైన కర్టెన్లు అమర్చుతారని!

రాజారావు నడుస్తున్నాడు, వూగిపోతో.

వీధి చివరి రేషను దుకాణం దగ్గర పిచ్చుకొలతలగోల ఎప్పుడూ వింటోనే వుంటాడు రాజారావు...

ఆ పక్క కటకటాల యింటిలోంచి, ఆ పళ్ళెత్తావిడ అబ్బ! ఎంత తీయగా పాడుతుందీ! చుట్టుపక్కల దుమారాన్ని లెక్కచేయకండా నిత్యమూ సాధన చేస్తుందావిడ. ఆవిడ పాడే ఓ కీర్తన రాజారావుకి నేతి మిఠాయిలా వుంటుంది. తను కూడా మనసులో రాగం తీసుకొంటో నడుస్తాడు - మరో ఆలోచన మనసును మార్చేవరకూ.

అంతా ఎప్పటిలాగానే వుంది.

అంతా పాతగానే వుంది.

అయినా ఇవాళ రాజారావుకి ఎందుకో అంతా కొత్తగావుంది.

రాజారావు కాళ్లు గాలిలో తేలుతున్నయి. అతని అరికాళ్ళలో స్ప్రింగులు అమర్చినట్టుగావుంది. నింగినీ, నేలనీ నింపుతో సూర్యుడు మండిపడుతోన్నా, రాజారావు మనసులో వెన్నెల విరుస్తోంది.

ఇవాళ అతని గొడుగు చురకలు పెట్టే

వేడిని అటకాయిస్తూ తలమీద పరుచుకొని లేదు. బొంగు మోస్తోన్నట్టు భుజానకూడా లేదు.

పాత తాసిల్దారుగారి చేతి కర్రలా దర్పంతో ఊగుతోంది. ఒక్కో అడుక్కి తాళం వేస్తూ హుందాగా నేలని తట్టుతోంది

అంతా కొత్తగావుంది ఇవాళ రాజారావుకి. ఎందుకో?

ముప్ఫయి రెండేళ్ళు ఒకే సీటులో మురిగి, మూలిగి చిన్న ప్రమోషనుమీద అంతకన్నా చిన్న సెక్షన్‌కి సీనియర్ గుమాస్తాగా వెళ్ళబోయే ఎన్జీవో మల్లే వుంది రాజారావు మనసు.

ఎంతో కొత్తగా వుందివాళ.

రాజారావునడక చురుగ్గా వుందివాళ.

చేవగలవాళ్ళు ముందుకు తోసుకుపోతోంటే కిరసనాయిలు దుకాణం దగ్గర నీరసప్రాణులు అరుస్తున్నారు...

చందాలు వసూలుచేసే అనాధాశ్రమం కుర్రాళ్లు చెవుల్ని చీలుస్తూ బాండు వాయిస్తున్నారు...

వొచ్చిన ఒక్క బేరం కోసమూ అరడజను మంది రిక్షావాళ్ళు పోట్లాడుకుంటోన్నారు...

పాడె కట్టి బియ్యం తర్లించుకుపోతోన్న జట్టువాళ్ల పేర్లు రాసుకుంటున్నారు పోలీసులు...

రాజారావుకి తెలివొచ్చింది.

"ఔరా, ఎంత దూరం!"

ఏమిటి తనకీ కొత్తశక్తి?'

ఎక్కణ్ణుంచి వొచ్చింది తనకి ఎన్నడూ లేని ఈ ఉత్సాహం?


ఇంత సత్తువ?

తన ఇంట్లోవున్న తాతలనాటి బొంతలోనుంచి తళుక్కుమనే ఒకే ఒక్క జలతారు పోగులా...

తన నల్లటి నుదుటిమీదనుంచి జారుతూ మెరిసే చెమట బిందువులా...

ఈ రోజు ఆకస్మాత్తుగా తన జీవితంలో ఈ మెరుపు ఏవిటి? ఈ వెలుగు ఎక్కడిది?

ఎక్కణ్ణుంచి తనకీ ఎన్నడూలేనిచురుకు?




కార్యకారణ సంబంధాన్ని గూర్చి ఎన్నడూ పట్టించుకొనే తత్వం కాదు రాజారావుది...

తన జీవితం ఎన్నడూ ఎందుకిలా... వీధికుళాయి ధారలా...

తూర్పునే సూర్యుడు ఉదయించేలా...

ఎందుకు గడుస్తున్నదీ తను ఎప్పుడూ ఆలోచించనే లేదు ఆలోచించగల శక్తీ లేదు రాజారావుకి.

అంతుపట్టని కారణాల గురించి తర్కించుకొనే ఓపికకూడా రాజారావుకి.

కాని ఈ రోజు తన జీవితంలో మాటలకందని చైతన్యం ఎలా వొచ్చింది? తనకి తెలీకండానే మూడు వీధులు ఎట్లా దాటగలిగాడు?

ఏ దేవకన్యలైనా అలా గాలిలో వూపుతో, అలా మబ్బుల్లో తేలుస్తో, తన్ని మత్తెక్కించి, మురిపించి, మైమరపించి...చివరకి వీడు రాజారావు అని తెలుసుకొని గభీమని వొదిలేసి వెళ్ళిపోయారా? ఏమో?

రాజారావు నడుస్తున్నాడు. కాళ్ళు గాలిలో వూపుతో వెడుతున్నాడు ముందుకు చూస్తో నడుస్తున్నాడు...

ఎవరో పిచ్చికుక్కమీద రాయి విసిరారు. చిరాగ్గా అరుస్తూ అది రాజారావు వైపుకి దౌడుతీసింది. గాభరా పడ్డాడు రాజారావు. తనమీద పళ్ళేదు కుక్క. పక్కసందులోకి పరుగెత్తింది రోదిస్తో. కాని రాజారావు కంకరగుట్టమీద పడ్డాడు. సూదాటి చిన్నరాయి మోచేతికి గుచ్చుకొంది.

"అమ్మా..." అన్నాడు రాజారావు అతని జోడు తెగిపోయింది. "ఛ...!" అనుకొన్నాడు రాజారావు. నొప్పితో అస్పష్టంగా మూలిగాడు. చిరాకుతో కనుబొమ్మలు ముడివేశాడు.

చెప్పు ఈడ్చుకొంటూ నడుస్తున్నాడు. ముందుకి చూస్తో ఈడ్చుకొంటున్నాడు.

ఉత్సాహంగా, ఉల్లాసంగా ఈలలు వేసుకొంటూ తిరిగే ఆ స్టూడెంటు కుర్రాళ్ళకి జోడు మడమలోంచి రాళ్ళు గుచ్చుకోవేం?

వాలుజడసవిరించుకొంటూ విలాసంగా, మునిముసి నవ్వులు నవ్వే ఆ వెంకటింటి వారి పెద్దపిల్ల నీళ్ళబిందెలు మోయదేం?

కాలిమీద కాలు వేసుకొని చుట్టపొగల చక్రాల్లో తేలుతూ, సుఖపడుతోన్న ఆ నామాల తాతగారు షావుకారు చిఠాపుస్తకాల దొంతరకింద కప్పడిపోడేం?

వీధి చివర రేషన్లు దానంచేసే సెట్టిగారి కొడుక్కి అస్సలు ఆకలి వేయదేం?

తెగని ఆలోచలు...

చిక్కు విడని సమస్యలు...

ఎందుకో...?

ఎందువల్లనో...?